## క్లుప్తంగా

### బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

గుత్తి: ఇంటి పన్ను, నీటి పన్నుల బకాయిల వసూలుకు ఆదివారం మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆధ్వర్యంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలసి కమిషనర్ ఇళ్లు, దుకాణాలకు వెళ్లి సుమారు రూ. లక్ష దాకా పన్నులు వసూలు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్నులు చెల్లించాలన్నారు. పన్నులు సకాలంలో చెల్లిస్తే మున్సిపాలిటీని అభివృద్ధి చేయడానికి వీలుంటుందన్నారు. పన్ను బకాయిలు చెల్లించకపోతే నోటీసులు జారీ చేసి మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఓ కమలాకర్ సతీష్, ఆర్ఐ షెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

### రంజాన్ కానుకల పంపిణీ



కానుకలను అందిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి రూరల్: రంజాన్ పండుగను పురస్కరించుకొని రూ.3 లక్షల విలువైన కానుకలను ఇమాంలు, మోజన్లకు పంపిణీ చేశామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు, ఫయాజ్‌బాషా ట్రస్టు చైర్మన్ ఫయాజ్‌బాషా తెలిపారు. స్థానిక నివాసం ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పట్టణంతో పాటు సరిహద్దులో ఉన్న 30 మసీదుల్లోని ఇమాంలకు రూ.6,500, మోజన్లకు రూ.3,500 నగదు, రెండు జతల చొప్పున దుస్తులను పంపిణీ చేస్తున్నామన్నారు. ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. పట్టణంలోని ప్రసాద్ ఆస్పత్రి సమీపంలో ల్యాబ్‌ను ఏర్పాటు చేసిన పేద ప్రజలకు అన్ని రకాల పరీక్షలను ఉచితంగా చేస్తున్నామన్నారు.

### చలివేంద్రాల ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలో ఆదివారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో రెండు చలివేంద్రాలను ప్రారంభించారు. స్థానిక ఎర్రక్షమ్మయ్య ఆయిల్‌మిల్ ఆవరణంలో ఒకటి, ఎద్దులపల్లిరోడ్డులోని షిర్డీసాయి ఫర్టిలైజర్స్ దుకాణం వద్ద మరొకటి ఏర్పాటు చేశారు. అత్యవసర పని మీద మండల కేంద్రమైన పామిడికి విచ్చేసే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు, బాటసారులకు ఈ చలివేంద్రాలు దాహార్తిని తీర్చడానికి ఎంతగానో తోడ్పడతాయని ఈసందర్భంగా ఆ సమితి అధ్యక్షుడు కే విశ్వనాథ్ అన్నారు. కార్యక్రమంలో ఆసమితి సభ్యులు సుధాకర్, సుధీర్, సురేష్, లక్ష్మీనారాయణ, రఘు, ప్రశాంత్, శ్రీనివాస్, నగేంద్ర, మధు పాల్గొన్నారు.

### పన్ను వసూలు చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమ

గార్లదిన్నె: గ్రంథాలయ పన్ను వెంటనే వసూలు చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కారర్యదర్శి రమ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయంలో రికార్డులు పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి సెస్ అత్యవసరమన్నారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలు పాఠకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రంథాలయ పన్ను వసూలు చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి శిరీష, పాఠకులు పాల్గొన్నారు.

### ఘనంగా ఆరాధనోత్సవం

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో క్రైస్తవులను ఉద్దేశించి దైవదాసులు పీవీఎస్ రాజు ప్రసంగించారు. దేవుడి ఆజ్ఞాతిక్రమమే పాపం అన్నారు రాజైన దావీదు పశ్చాత్తాప ప్రార్థన దేవుడికి హృదయానుసారుని చేసిందన్నారు. తద్వారా మనం కూడా రాజైన దావీదు లాగ పశ్చాత్తాపంతో కూడిన ప్రార్థన చేయడం వల్ల మన పాప దోషాలు క్షమించ బడతాయన్నారు. తద్వారా మనకు పరలోక భాగ్యం ప్రాప్తిస్తుందన్నారు. క్రీస్తుతోనే నిత్యజీవం లభిస్తుందన్నారు. ఆరాధన కార్యక్రమంలో చర్చి సభ్యులు, వీరయ్య, జకరయ్య, పీసీ రత్నరాజు, అబ్రహాం, హోసన్నా, బుజ్జిబాబు, కరుణాకర్, బాబావలి, అల్లీపీరా, ప్రసాద్, రజని, చంద్రకళ, శాంతమ్మ, డాక్టర్ కమల, రేచెల్, వాణి, మహిమ, భారతి, లత, రమాదేవి, జ్యోతి పాల్గొన్నారు.

# మందుబాబుల వీరంగం

- రాత్రి పూట మార్కెట్‌లో ఆగడాలు
- ఇబ్బంది పడుతున్న చిరు వ్యాపారులు



తాడిపత్రిలోని దినసరి కూరగాయల మార్కెట్

తాడిపత్రి రూరల్: మందు బాబుల వీరంగంతో పట్టణంలోని దిన కూరగాయల మార్కెట్‌లో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రయితే చాలు తాగుబోతుల చర్యలతో మహిళలు అవమానాలకు గురవుతున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని గంప వ్యాపారులు మార్కెట్ ప్రధాన ద్వారం వద్ద వివిధ రకాల పండ్లు, పూలు, ఆకు కూరలను విక్రయిస్తుంటారు. అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి కొనుగోలు చేస్తుంటారు. తెల్లవారుజామున మార్కెట్ వచ్చి అరకొరగా అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బులో కొంత భాగాన్ని అప్పు ఇచ్చిన వారికి దినసరి వడ్డీ చెల్లించి మిగిలిన మొత్తాన్ని కుటుంబ పోషణ కోసం తీసుకెళ్తుంటారు. మిగిలిన పండ్లు, పూలు, ఆకు కూరలను భద్ర పరిచి అక్కడే వదిలి వెళుతుంటారు. రాత్రి 9 గంటల సమయంలో గంప వ్యాపారులు ఇళ్లకు వెళతారు.

**పైశాచిక ఆనందం**

ఈ సమయం కోసం ఎదురు చూసే మందు బాబులు వారు వెళ్లిన తరువాత తమ వీరంగాన్ని ప్రారంభిస్తారు. గుంపులుగా చేరి వ్యాపారులు భద్రపరిచిన పండ్లు, పూలు, ఆకు కూరలను చిందర వందర చేయడం, మందులోకి వాటిని ఉపయోగించుకోవడం చేస్తున్నారు. కొందరు వాటిని ధ్వంసం చేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. ఎక్కువగా హమాలీలు, దిన సరి కూలీలు, బండ్ల వ్యాపారులు, పోకిరీలు మందు బాటిళ్లను తెచ్చుకుని తాగుతుంటారు. తెల్లవారే సరికి గంప వ్యాపారుల స్థలాల్లో మందుబాటిళ్లు, తాగి పడేసిన గ్లాసులు, తిండి పదార్థాలతో చిందరవందరగా చేసి ఉంటారు. వాటన్నింటిని వ్యాపారులు తొలగించి వ్యాపారాలను కొనసాగించాల్సి దుస్థితి నెలకొంది.

**కొరవడిన పోలీసుల నిఘా**

దిన కూరగాయల మార్కెట్‌పై పోలీసుల నిఘా కరువైంది. గతంలో రాత్రి సమయాల్లో పోలీసులు మార్కెట్ ప్రాంతానికి వచ్చి పోకిరీలు, మందు బాబులకు దేహశుద్ధి చేసి అక్కడి నుంచి తరిమివేసేవారు. పోలీసుల దెబ్బలకు భయపడి అక్కడికి మందుబాబులు వచ్చేవారు కాదు. ఈ మధ్య కాలంలో పోలీసుల నిఘా కొరవడడంతో తిరిగి మందు బాబుల వీరంగం పెరిగిపోతోంది. పోలీసులు స్పందించి రాత్రి సమయాల్లో మందు బాబుల అరాచకాలను అరికట్టాలని చిరు వ్యాపారులు వాపోతున్నారు.

**పోలీసుల దృష్టికి తీసుకెళ్తాం**



చిరు వ్యాపారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం. మందుబాబుల వీరంగం నుంచి వ్యాపారులను కాపాడేందుకు పోలీసుల నిఘా పెంచే ఏర్పాట్లు చేస్తాం. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్తాం.

– శివరామక్రిష్ణ, మునిసిపల్ కమిషనర్

### చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చర్యలు



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

పుట్లూరు: చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని గరుగుచింతలపల్లి గ్రామంలో ఆదివారం డీఎస్పీ పర్యటించారు. గ్రామంలో నెలకొన్న వివాదాలపై ఆయన ఆరా తీశారు. రెండు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగరాజుపై దాడికి పాల్పడిన ఘటనతో పాటు ఆదివారం టీడీపీకి చెందిన నాగరాజు చీనీ చెట్ల నరికివేతతో పోలీసులు అప్రమత్తమైయ్యారు. వివాదాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచామని, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ గ్రామస్తులను హెచ్చరించారు. అనంతరం గ్రామంలో బందోబస్తులో ఉన్న పోలీసు సిబ్బందికి ఆయన పలు సూచనలిచ్చారు.

### క్రికెట్ టోర్నీ ప్రారంభం

తాడిపత్రి రూరల్: పట్టణంలోని శ్రీనివాసపురంలో ఆదివారం తాడిపత్రి ప్లేనౌబాక్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. టోర్నమెంట్‌లో 20 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకుడు కేదర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. విన్నర్ జట్టుకు రూ.12 వేలు, రన్నర్ జట్టుకు రూ.5 వేలు అందజేస్తామన్నారు. అధునాతన టెక్నాలజీతో గ్రౌండ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

## తరుగు పేరుతో కంది రైతులకు మోసం

పుట్లూరు: తరుగు పేరుతో కంది రైతును మోసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్లితే...పుట్లూరు మండలం పి.చింతలపల్లి గ్రామానికి చెందిన రైతు లక్ష్మీ నారాయణ రెడ్డి తాను గత ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన కందులను యాడికి మండలం రాయలచెరువులోని ఓ వ్యాపారి వద్దకు విక్రయించడానికి తీసుకెళ్లాడు. తాడిపత్రిలో ఉండే మిల్లుల వద్ద కంటే ఎక్కువగా ఆ వ్యాపారి క్వింటాల్‌కు రూ.7,100 చెల్లిస్తుండటంతో 52 బస్తాల్లో కందులను వే బ్రిడ్జి కాటాలో 32 క్వింటాళ్లుగా నిర్ధారించుకుని తీసుకెళ్లాడు. రైతు తీసుకెళ్లిన కందుల బస్తాల్లో బస్తాకు కొన్ని కందులను మొత్తం కిలో తీసుకుని వాటిని చిన్నపాటి జెల్లెడలో వేసి తరుగును లెక్కగట్టాడు. ఇలా లెక్క గట్టిన తరుగును ఎలక్ట్రానిక్ తూకపు యంత్రంలో ముందుగానే మైనస్ చేసి బస్తాలను తూకం వేయగా 26 క్వింటాళ్లు వచ్చినట్లు రైతుకు తెలిపాడు. క్వింటాల్‌కు ఐదు కిలోల తరుగు ఉన్నా 160 కిలోలు పోనూ కనీసం 30 క్వింటాళ్ల కందులు ఉండాలని వ్యాపారితో రైతు వాగ్వాదానికి దిగారు. దీంతో మీ కందులు మీరు తీసుకెళ్లండి అన్న వ్యాపారి చివరకు అదనంగా ఒక క్వింటాల్‌కు డబ్బులు చెల్లిస్తానని చెప్పి రైతును పంపించాడు. తరుగు పేరుతో మోసం చేస్తున్న తీరుపై రైతులు మండి పడుతున్నారు. మూడు రోజుల క్రితం చోటు చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో కంది రైతులు అప్రమత్తమైయ్యారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటాల్‌కు రూ.7,550 చెల్లిస్తున్నప్పటికీ డబ్బు ఆలస్యంగా రావడం, నాణ్యత పేరుతో వెనక్కి పంపుతారనే భావనతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం



ఈశ్వరపల్లిలో కార్యకర్తను పరామర్శిస్తున్న నైరుతిరెడ్డి

గుత్తి రూరల్: కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, గుంతకల్లు మునిసిపల్ వైస్ చైర్ పర్సన్ నైరుతిరెడ్డి అన్నారు. ఆదివారం ఆమె గుత్తి మండలంలో పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఈశ్వరపల్లికి చెందిన రామాంజనేయులు రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా ఆమె పరామర్శించారు. అలాగే అనగానదొడ్డి గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త వేల్పుల రంగనాథ ఇంట్లో జరిగిన శుభకార్యంలో ఆమె పాల్గొన్నారు. అనంతరం పట్టణ శివార్లలో కొత్తపేట గ్రామంలోని స్పందన ఫంక్షన్ హాల్‌లో జరిగిన గుత్తి ఎస్ఐ సురేష్ వివాహానికి ఆమె హాజరై వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కప్పలబండ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్, కౌన్సిలర్ వరదరాజులు, నాయకులు వేల్పుల భాస్కర్, రంగస్వామి, సుధాకర్, అబ్దుల్ పాల్గొన్నారు.



ఎండిపోయిన పురాతన కందకం

### మొదటిసారి ఎండిన కందకం

గుత్తి: శతాబ్దాల క్రితం శ్రీకృష్ణదేవరాయల కాలంలో ప్రజల సంరక్షణార్థం గుత్తి కోట చుట్టూ నిర్మించిన కందకం తొలిసారిగా నీటి బొట్టు లేకుండా ఎండిపోయింది. కోట ముఖ ద్వారం వద్ద కందకంలో ఎప్పుడూ నీళ్లు సమృద్ధిగా ఉండేవి. దీంతో పరిసర ప్రాంతాల్లోని బోరుబావుల్లో నీరు పుష్కలంగా లభ్యమయ్యేది. ప్రస్తుతం కందకం పూర్తిగా ఎండిపోవడంతో ఇప్పటికే బోరు బావుల్లో నీటి లభ్యత తగ్గిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### 'కోటంక కొండల్లో ప్రత్యేక పూజలు



గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## పొట్టి శ్రీరాములు ఆశయ సాధనకు కృషి



గుంతకల్లులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అవోపా నాయకులు



గుత్తిలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



యాడికిలో పొట్టి శ్రీరాములు జయంతి నిర్వహిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

గుంతకల్లుటౌన్/గుత్తి/పెద్దవడుగూరు/తాడిపత్రి రూరల్: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆశయాల సాధనకు పాటుపడతామని అవోపా అధ్యక్షుడు చెన్నకేశవులు, కార్యదర్శి దారా రాము అన్నారు. ఆదివారం పొట్టిశ్రీరాములు జయంతి సందర్భంగా గుంతకల్లు మెయిన్‌రోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గోపాజగదీష్, కృపాకర్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తి, గుత్తి ఆర్ఎస్ ఆర్యవైశ్య సంఘం నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కలుగొట్ల కిషోర్ , గుత్తి, ఆర్ఎస్ ఆర్య వైశ్య సంఘం నాయకులు నాగ సుదర్శన్, తాయి వెంకటేష్, వెంకట్, జక్కా మహేష్, మల్లికార్జున గుప్తా, మధుసూదన్, తల్లం సుబ్రమణ్యం, కృష్ణయ్య, నారాయణ, న్యాయవాది నరసింహులు, గుర్రబాడు సత్య తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తిలో ఆదివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, పట్టణ, మండల కన్వీనర్లు మధుసూదన్ రెడ్డి, గంగరాజు, కౌన్సిలర్ వరదరాజులు, సీనియర్ నాయకులు షఫి, జీపు రమణ, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- యాడికిలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పవన్, శేఖర్, రాజు, విశనాథ్, సతీష్, ప్రదీప్, నితిన్, రవి తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

- తాడిపత్రి పట్టణంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పోలీసు స్టేషన్ సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని పట్టణ సీఐ సాయిప్రసాద్ ప్రారంభించారు. అలాగే ప్రభుతాస్పత్రిలో రోగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### అనుమతి లేకుండా ప్లాట్లు




అనుమతి లేకుండా పొలంలో ప్లాట్ల ఏర్పాటు కోసం రాళ్లు సిద్ధం చేసిన దృశ్యం

పుట్లూరు: అనుమతి లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు వేసి, విక్రయిస్తూ జేబులు నింపుకోవడంతోపాటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. తాడిపత్రి పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండే పుట్లూరు మండలంలోని గాండ్లపాడు సమీపంలో సర్వే నంబర్ 41లో ప్లాట్లను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేయడంపై స్థానికులతో పాటు ఆ పంచాయతీ సర్పంచ్ సాయిభారతి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ మాట్లాడుతూ నిబంధనల మేరకు అనుమతులు తీసుకోవడంతో పాటు వ్యవసాయ భూమిని కమర్షియల్‌కు మార్పు చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఆయా ప్లాట్లకు మౌలిక వసతుల కల్పన భారం ప్రభుత్వాలు, పంచాయతీలపై పడుతుందన్నారు. అక్రమ ప్లాట్లను నివారించాలని ఎంపీడీఓ అలివేలమ్మకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ వివరించారు.

### జిరాక్స్ సెంటర్లు మూసేయాలి

తాడిపత్రిటౌన్: ఎస్పీ, తాడిపత్రి ఏఎస్పీ ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరంలో ఉన్న జిరాక్స్ సెంటర్‌లను మూసివేయాలని సీఐ సాయిప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షలు సోమవారం ప్రారంభమవుతాయన్నారు.

## పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



గుంతకల్లుటౌన్: పట్టణంలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకూ ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల దాకా పరీక్షలు జరుగనున్నాయి. పట్టణంలో మొత్తం 2,335 మంది (2,204 మంది రెగ్యులర్, 131 ప్రైవేట్) విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షల నిర్వహణకు పట్టణంలోని రైల్వే హైస్కూల్, ఆర్‌పీ మున్సిపల్ హైస్కూల్, సర్వేపల్లి రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్, సరోజినినాయుడు మున్సిపల్ గర్ల్స్‌హైస్కూల్, రోటరీ హైస్కూల్, ఎస్‌జేపీ ప్రభుత్వ పాఠశాల, చైతన్య, బాష్యంతో కలిపి మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ మస్తాన్‌రావు ఆదివారం తెలిపారు. ఎనిమిది మంది చీఫ్ సూపరింటెండెంట్, ఎనిమిది మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 120 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు.


తాడిపత్రిటౌన్: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంఈఓ నాగరాజు ఆదివారం తెలిపారు. తాడిపత్రి పట్టణంలో దాదాపు 10 సెంటర్లలో 2,524 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రకాశం హైస్కూల్, మున్సిపల్ బాయ్స్ హై స్కూల్, త్రిబుల్ ఎస్ పాఠశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీవాణి, టార్గెట్, శ్రీచైతన్య, సాయివిజేత, నారాయణ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలున్నాయన్నారు.

శింగనమల: శింగనమల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతున్నట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 297మంది విద్యార్థులు , ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 132 మంది, కేజీబీవీ పాఠశాలలో 165 మంది మొత్తం 594 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

గార్లదిన్నె: మండలంలో సోమవారం నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానుండడంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ తారా చంద్రనాయక్ తెలిపారు. ఆదివారం ఎంఈఓ మాట్లాడుతూ మండలం కేంద్రం గార్లదిన్నె, కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో, మోడల్ స్కూల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా రెగ్యులర్ 605 మంది, ప్రైవేట్ విద్యార్థులు 122 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు.

పామిడి: పట్టణంలోని టీసీహైస్కూల్, ఎస్ఎఫ్ఎస్, సరస్వతీ ఉన్నత విద్యామందిరం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. స్థానిక టీసీ హైస్కూల్‌లో 280 మంది, ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో 187 మంది, సరస్వతీ ఉన్నత విద్యామందిరంలో 199 మంది; ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 130 మంది చొప్పున మొత్తం 796 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా వెంకటనాయుడు, ప్రసాద్‌నాయుడు, రాఘవేంద్ర, మధుకుమార్ వ్యవహరించనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద సీఐ వీ యుగంధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ బీఆర్ ప్రసాద్, పోలీసులు బందోబస్తు చేపట్టనున్నారు.

## రహదారి అధ్వానం.. ప్రయాణం నరకం!



గుంతలమయంగా చాములూరు-నార్పల రోడ్డు

శింగనమల: రహదారులు అధ్వానంగా మారడంతో వాహన దారులు నరకం చూస్తున్నారు. నియోజకవర్గంలోని చక్రాయిపేట నుంచి చాములూరు-నిలువురాయి మీదుగా నార్పల రోడ్డు వరకూ ఉన్న రహదారి గుంతలమయంగా మారింది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. చక్రాయిపేట నుంచి చాములూరు వరకు ఉన్న రహదారిలో 100కుపైగా గుంతలుగా ఉన్నాయి. చాములూరు నుంచి నిలువురాయి, నిలువురాయి నుంచి నార్పల రోడ్డు వరకూ 200 గుంతలు దాకా ఉన్నాయి. అధికారంలోకి వస్తే రోడ్లను అభివృద్ధి చేస్తామన్న కూటమి నాయకులు రహదారులను పట్టించుకోవడంలేని ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈ రోడ్డు మీద ప్రయాణిస్తే తాము పడే ఇక్కట్లు తెలుస్తాయన్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలు పూడ్చి రోడ్లు మరమ్మతు చేయాలని ప్రజలు కోరుతున్నారు.